

అధునాతన వైద్యం అందరికీ చేరువ కావాలి

కొంపల్లిలో శ్రీనందకా అడ్వాన్స్ సర్జరీ సెంటర్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి కేటీఆర్

కొంపల్లిలో శ్రీనందకా అడ్వాన్స్ సర్జరీ సెంటర్‌ను నిర్వాహకులతో కలిసి ప్రారంభిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 20:మారిన కాలానికి అనుగుణంగా వైద్యఆరోగ్య రంగంలో వినియోగంలోకి వచ్చిన అధునాతనమైన పరిజ్ఞానంతో ఆపరేషన్లు మరింత సులభత రంగా మారాయని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇదే స్ఫూర్తితో వైద్యరంగ నిపుణులు తమ సేవలు సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఆదివారం కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనందకా అడ్వాన్స్ సర్జరీ సెంటర్‌ను మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి రోజుల్లో నూతన పరిజ్ఞానంతో చికిత్స పొందుతున్న వ్యక్తులు త్వరితగతిన కోలుకోవడం అభినందనీయమని, ఇదే సేవలను సామాన్య ప్రజలకు చేరువలో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు ప్రతిపక్షనేత మధుసూదనాచారి, శంభీపూర్‌రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆపదలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్థాయి

అయ్యప్పస్వాములతో ఎమ్మెల్యే వివేకానంద్,డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్

దుండిగల్/కుత్బుల్లాపూర్, అక్టోబర్ 20:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిహర సుతుడైన అయ్యప్పకు పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పమాల ధారులకు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి(గురుస్వామి), ఆలయ ప్రధాన అర్చకులు నాగార్జునస్వామి(లాలుస్వామి), కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– పెద్దమ్మతల్లి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అభిలాషించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాష్‌నగర్ డివిజన్ పరిధి, ఎస్వీకో-ఆపరేటివ్ సొసైటీలోని పెద్దమ్మ తల్లి ఆలయం వార్షిక వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ జీ.సురేశ్‌రెడ్డి,డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

– నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,బాచుపల్లి.రాజీవ్‌గాంధీనగర్ సమీపంలో ఆదివారం నిర్వహించిన గార్మీ షరీఫ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. కార్పొరేటర్ ఆగంరాజు, సలీం, నబీ, ఖాన్‌సాబ్, మక్సూద్‌అలీ, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్ : గతేడాది ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఎల్లక్ట్రీషియన్ కుటుంబానికి విద్యుత్ విభాగం నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బాధితుడి కుటుంబానికి అందించారు. మెదక్ జిల్లా చేగుంట మండలానికి చెందిన పాండ్యాల రాజాగౌడ్, తన భార్య నవ్యతో కలిసి బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేస్-2లో నివాసం ఉంటున్నాడు.ఉన్న ఇంట్లో గోడలకు కరెంటు షాక్ రావడంతో సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు రాజాగౌడ్ మృతి చెందాడు.

కాలనీలో వసతులు కల్పిస్తా : ఎమ్మెల్యే గాంధీ

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, అక్టోబర్ 20: నియోజకవర్గంలో ప్రతి కాలనీని మౌలిక వసతుల కల్పనపరంగా పురోగతి వైపు నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై తక్షణమే కాలనీలో పర్యటించి తగు వసతులు కల్పిస్తున్నామన్నారు. నవోదయ కాలనీలో త్వరలో పర్యటించి సమస్యల నుంచి ఊరట కల్పిస్తానని హామీ ఇచ్చారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీ వాసులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గాంధీని ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి ప్రగడ సత్యనారాయణ, కాలనీవాసులు వాసు, శేఖర్, రవి, వంశీ, సత్యం, భూపాల్‌రెడ్డి, విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

నారాయణ రెసిడెన్షియల్ కళాశాల ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

దుండిగల్,అక్టోబర్20: చదువు ఇష్టంలేని ఓ ఇంటర్ విద్యార్థిని వసతి గృహం గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన లక్ష్మయ్య కుమార్తె సిరిపురం అనూష(17), బాచుపల్లిలోని నారాయణ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. అయితే చదువుపై ఇష్టంలేని ఆమె ఆదివారం సాయంత్రం తన హాస్టల్ గదిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబకలహాలతో వ్యక్తి..

కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం...నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన అశోక్(27)అనే వ్యక్తి స్థానికంగా జలమండలి వాటర్ ట్యాంకర్‌లను నడుపుతూ ఉపాధిని పొందుతున్నాడు. ఆర్థికలావాదేవీల విషయంలో గత కొన్ని రోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లో అశోక్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ద్విచక్రవాహన ప్రయాణంలో హెల్మెట్ తోనే భద్రతని బ్రైట్‌కాన్సెప్ట్ హైస్కూల్ కరస్పాండెంట్ వినోద్ జాదవ్ సూచించారు. రంగారెడ్డినగర్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఐసీఐసీఐ, ట్రాక్స్-ఎస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కోరారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరుతూ విద్యార్థులు స్థానికులతో కలిసి ర్యాలీ తీశారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు 500 హెల్మెట్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. ట్రాక్స్‌ఎస్ ప్రతినిధి ఆరాధ నజైన్, బ్రైట్‌యూరోకిడ్స్ ఇంచార్జిలు వికాస్ జాదవ్, ఆయేషాబేగం, పాఠశాల సిబ్బంది ప్రభు, అంబిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. – *జగద్గిరిగుట్ట, అక్టోబర్ 20*

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా..

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 20:మైత్రినగర్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరిందుకు కృషి చేస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సత్యనారాయణను మైత్రినగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు కలిసి కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు వివరించారు. ఎమెల్యే కృష్ణారావు మాట్లాడుతూ..కాలనీలు, బస్తీలో నెలకొన్న సమస్యలన్నింటి పరిష్కరించామన్నారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు ఉన్నారు.

క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లను కలిసిన మైత్రినగర్ సంక్షేమ సంఘం సభ్యులు

CHANGE OF NAME
I, GADHAPU KARUNA, W/o. Thegutla Prabhu Kiran, R/o. H.No. 3-4-1/1, Mallampet, Bachupally, Medchal-Malkajgiri Dist. Corrected My Surname THEGUTLA KARUNA for all purposes.